మహబూబ్‌నగర్‌లోని ఓ దళిత కాలనీపై శనివారం తెల్లవారుజామున 3 గంటలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బుల్డోజర్లతో దాడికి పాల్పడింది. దాడిలో దళితుల ఇండ్లు నేలమట్టమయ్యాయి. తమ ఇండ్లను కూల్చివేయడంతో మహిళలు భోరున విలపిస్తున్న దృశ్యాలవి.

బుల్డోజర్లతో మతిలేని పాలన

దళితుల ఇండ్ల కూల్చివేతపై కేటీఆర్ వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): మతిలేని పాలనలో బుల్డోజర్లే సమస్యలకు పరిష్కారమని నమ్మినప్పుడు ఇలాంటి దృశ్యాలే సాక్షాత్కరిస్తాయి అంటూ మహబూబ్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చివేసిన వికలాంగుల ఇండ్ల చిత్రాలను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెల్లవారుజామున మూడు గంటలకు ఓ దళిత కాలనీపై దాడికి దిగి 75 ఇండ్లను బుల్డోజ్ చేసిందని శనివారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. ఇందులో 25 వికలాంగుల, అంధుల కుటుంబాలు ఉన్నాయని, వారి ఇండ్లు కూలగొట్టడం బాధాకరమని పేర్కొన్నారు. తమ ఇండ్లు నేలమట్టం కావడంతో ఆ పేదలందరూ నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ తొమ్మిది నెలల ప్రజాపాలన ఒక్కో చిత్రంలో ఉందని పేర్కొంటూ కూలిపోయిన పేదల ఇండ్ల ఫోటోలను షేర్ చేశారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మృదుల

ఉన్నత విద్యాసంస్థల కోటాలో ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అందజేసే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తెలంగాణకు చెందిన డాక్టర్ నందవరం మృదుల ఎంపికయ్యారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మృదులను కేంద్ర విద్యాశాఖ ఎంపికచేసింది. ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కాలేజీల నుంచి జాతీయంగా 16 మందిని ఎంపికచేయగా, తెలంగాణ నుంచి మృదుల ఎంపికయ్యారు. 5న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు.

గనులశాఖ డైరెక్టర్‌గా సురేంద్రమోహన్

- పలువురు ఐఏఎస్‌ల బదిలీ, అదనపు బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేయడంతోపాటు కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం జీవో-1167 జారీచేశారు. గనులశాఖ డైరెక్టర్‌గా కే సురేంద్రమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. భూసేకరణ, పునరావాస కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయేషా మస్రత్‌ను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా తఫ్సీర్ ఇక్బాల్, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనార్టీ ఆర్థిక సంస్థ ఎండీగా నిర్మలా కాంతి వెస్లీకి అదనపు బాధ్యతలు ఇవ్వగా.. వక్ఫ్‌బోర్డ్ సీఈవోగా మహ్మద్ అసదుల్లా నియమితులయ్యారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా జీ మల్సూర్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. ఖమ్మం అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ)గా శ్రీజను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీసీ నేత రాజారాంయాదవ్

బీసీలపై రేవంత్ సర్కారు నిర్లక్ష్యం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- అంతిమ పోరుకు బీసీలు సిద్ధం: రాజారాంయాదవ్
- గాంధీలో దీక్ష చేస్తున్న సంజయ్, సిద్ధేశ్వర్లకు పరామర్శ

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: బీసీల పట్ల రేవంత్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. గాంధీ దవాఖానలో ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న ఆజాది యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కలి సంజయ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్‌ను శనివారం వారు మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుతో కలిసి పరామర్శించారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో వారు ఏడు రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బీసీల పట్ల ఉన్న పక్షపాతానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయించేందుకు బీసీలంతా అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ పిలుపునిచ్చారు. రాత్రి సంజయ్ ఆరోగ్యం క్షీణించింది. వాంతులు, విరేచనాలతోపాటు సెలైన ఎక్కించిన కుడి చేతికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో ప్రాణానికి ప్రమాదమన్న ఆందోళనతో ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. తెలంగాణ గౌడ సంఘం నేత జైహింద్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిడికిలి రాజు, వెంకట్‌గౌడ్, అవ్వారు వేణుకుమార్, కొంగర నరహరి పాల్గొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

- కాంగ్రెస్ మ్యానిఫెస్టో, సీఎం హామీని అమలు చేయాలి
- 'స్థానిక' ఎన్నికల అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ డిమాండ్
- 9న జిల్లా, 10న మండల స్థాయిలో అఖిలపక్ష సమావేశాలు

హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో జరగనున్న అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లోని ఎన్నికల కమిషనర్ పార్థసారథి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు పాల్గొన్నారు. 42% రిజర్వేషన్లపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారని వారు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ల జాబితా రూపొందిస్తున్నారని, బీసీల రిజర్వేషన్లను 42 శాతంగా అమలయ్యేలా చూడాలని కోరారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై 8 నెలలుగా రెండుసార్లు పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షలు చేసి ఎలాంటి ఆదేశాలు ఇచ్చిందో తేల్చాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణనకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో అధికారంలో ఉన్నా కులగనన, బీసీగణన చేయకుండా పంచాయతీరాజ్ ఎన్నికలకు వెళ్తుందనే అనుమానాలు ప్రజల్లో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పంచాయతీల పాలనాకాలం ముగిసి ఏడు నెలలు ముగిసినా బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపు అంశంపై గానీ ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని చెప్పారు.

ప్రభుత్వ పరిధిలో రిజర్వేషన్ల అంశం: కమిషనర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు అంశం ప్రభుత్వ పరిధిలో ఉన్నదని ఎన్నికల కమిషనర్ పార్థసారథి తెలిపారు. ఈ నెల 6న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారని, 9న జిల్లా స్థాయిలో, 10న మండల స్థాయిలో రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాలు ఒక కిలోమీటరు పరిధిలోనే ఉండేలా చూడాలని సూచించారు. వార్డుల విభజనలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఒకే వార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలతోపాటు కాంగ్రెస్ నుంచి నిరంజన్, బీజేపీ నుంచి చింతల రామచంద్రారెడ్డి, సీపీఎం నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు.

రాష్ట్రంలో 1.14 లక్షల వార్డులు

రాష్ట్రంలో 12,966 గ్రామ పంచాయతీలు ఉండగా, 1,14,620 వార్డులు ఉన్నాయని అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఆయా వివరాలను పార్టీల ప్రతినిధులకు అందజేసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 868 పంచాయతీలు ఉండగా, అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో 62 మాత్రమే ఉన్నాయని అధికారులు తెలిపారు. వార్డులపరంగా చూస్తే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 7,482, మేడ్చల్ జిల్లాలో 604 మాత్రమే ఉన్నాని వివరించారు.

బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణంకు స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న ఈవో భాస్కర్

కులగణన నిర్విఘ్నంగా కొనసాగాలి

బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం

యాదగిరిగుట్ట, ఆగస్టు 31: రాష్ట్రంలో కులగుణన నిర్విఘ్నంగా సాగాలని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నట్టు బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈవో భాస్కర్‌రావు ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన చేపట్టాలని తీర్మానం, ఇంటింటి సర్వే ప్రశ్నావళి రూపొందించి ప్రభుత్వానికి అందజేసే కార్యాచరణలో భాగస్వామ్యం కావడం సంతృప్తినిచ్చిందన్నారు. బీసీ కుల సర్వే పూర్తయ్యాక వచ్చిన సమగ్ర సమాచారంతో వారి జీవన ప్రమాణాల్లో మెరుగుదల తీసుకురావాల్సిన బాధ్యతను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. పదవీ కాలం ముగియడంతో కులగణనపై తుది నివేదిక ఇవ్వకుండానే నిష్క్రమించడం కొంత ఆవేదన కలిగిస్తున్నదని చెప్పారు.

విద్యుత్తు లైన్‌కు 20 వేలు లంచం

ఏసీబీకి పట్టుబడ్డ స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్పీడీసీఎల్ డీఈ హుస్సేన్‌నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 31 : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్పీడీసీఎల్ డీఈ రూ.20 వేలు లంచం తీసుకుంటూ శనివారం రాత్రి ఏసీబీకి పట్టుబడ్డాడు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కుంబం ఎల్లయ్య పొలం నుంచి విద్యుత్తు లైన్లు మార్చాలని, టవర్ల ఏర్పాటుకు రూ. 16 లక్షలతో డీడీ తీశాడు. నెలక్రితమే టవర్లను ఏర్పాటు చేశారు. ఎల్లయ్య రూ.20 వేలు ఇవ్వాల్సి ఉందని, వైర్లు లాగొద్దని డీఈ హుస్సేన్‌నాయక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించాడు. దీంతో ఆ 20 వేలు డీఈకి ఇచ్చేందుకు అంగీకరించాడు. ఎల్లయ్య కొడుకు రాజు డీఈకి రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

గృహజ్యోతి.. అలజడి రేపి!

- నమస్తే తెలంగాణ కథనంతో షాక్‌లో విద్యుత్తు శాఖ!
- జగిత్యాల మౌనిక ఇంటికి 6 నెలల బిల్లులపై కథనం
- స్వయంగా ఆమె ఇంటికి ఎన్పీడీసీఎల్ అధికారులు
- ఇది మౌనిక కథ కాదు.. రాష్ట్రమంతటా పలువురి గోస



7 19 045 ప్రజా పాలన దరఖాస్తు రశీదు
జోన్ / వార్డ్ కోడ్: దరఖాస్తు సంఖ్య: 0147
శ్రీ / శ్రీమతి పసుపుల మౌనిక తండ్రి / భర్త పేరు: రవికుమార్ గారి నుండి
మహాలక్ష్మి పథకం: ✓ రైతు భరోసా పథకం: ఇందిరమ్మ ఇండ్లు పథకం: ✓
గృహ జ్యోతి పథకం: ✓ చేయూత పథకం: కొరకు సమర్పించిన దరఖాస్తును స్వీకరించడమైనది.
గ్రామం / మున్సిపాలిటీ:
వార్డు నం.: 45
మండలం: జగిత్యాల
జిల్లా: జగిత్యాల
తేదీ: 5/1/2024
అధికారి సంతకం:
పేరు: ప్రజాపాలన
హోదా: జగిత్యాల పురపాలక సంఘం
ముద్ర:
ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం!

గృహజ్యోతి అమలు చేయాలని వేసిన రైట్‌మార్క్‌ను ట్యాంపరింగ్ చేశారని మౌనిక దంపతులు ఆరోపిస్తున్న ప్రజాపాలన దరఖాస్తు

జగిత్యాల, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ): 'ఆరిపోయిన గృహజ్యోతి పథకం' శీర్షికన నమస్తే తెలంగాణలో శనివారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మౌనికకు గృహజ్యోతి పథకం వర్తించకపోగా, ఒకేసారి 6 నెలల బిల్లలు చెల్లించాలన్న ఆమె ఆవేదనకు నమస్తే అక్షరరూపం ఇచ్చింది. ఈ కథనాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహా రాష్ట్రంలోని ఎందరో సోషల్ మీడియా వేదికల్లో పోస్టులుగా పెట్టారు. దీంతో ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించారు. మౌనిక సమస్యను పరిష్కరిస్తామని ట్విట్టర్ ద్వారా ప్రకటన చేశారు. ఎన్పీడీసీఎల్ అధికారులు మౌనిక ఇంటికి వెళ్లి విద్యుత్తు మీటర్‌తోపాటు బిల్లులు, ప్రజాపాలన దరఖాస్తు ఫారమ్ పరిశీలించారు. దరఖాస్తు ఫారమ్‌లో గృహజ్యోతి పథకం వర్తింపు కాలమ్‌లో రైట్‌మార్క్ వేయకుండా, ఇంటు మార్క్ వేసిందని, దీంతో ఆమె పేరును గృహజ్యోతి పథకంలోకి పరిగణనలోకి తీసుకోలేదని అధికారులు సెలవిచ్చారు. ఆమె కిరాయి ఇంటిలో ఉన్నట్టు పేర్కొనలేదనీ తేల్చారు. దాంతోనే ఆమెకు జీరో బిల్లు జనరేట్ కాలేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో సరిచేశామని, ఇక నుంచి మౌనికకు జీరో బిల్లు వస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు 6 నెలల విద్యుత్తు బిల్లు బకాయిలు చెల్లించాలని కోరడంతో మౌనిక భర్త రవికుమార్.. ఫోన్‌పే ద్వారా మొత్తం బకాయిలను చెల్లించారు. మౌనిక ఆవేదనకు పుల్‌స్టాప్ పడింది. రాష్ట్రవ్యాప్తంగా మౌనిక లాంటి పేదలు ఎందరికో గృహజ్యోతి అమలుగాక లబోదిబోమంటున్నారు. ఈ కథనాన్ని ప్రభుత్వం మౌనిక వ్యక్తిగత సమస్యగా పరిగణించడం విమర్శలకు దారి తీస్తున్నది.

రాంగ్ మార్క్‌గా టాంపరింగ్ చేశారు: మౌనిక దంపతులు

ప్రజాపాలన దరఖాస్తును ట్యాంపరింగ్ చేశారంటూ మౌనిక, ఆమె భర్త రవికుమార్ చెప్పారు. తాము దరఖాస్తు ఫారమ్‌లో గృహజ్యోతి కాలమ్‌లో రైట్‌మార్క్ వేశామని స్పష్టం చేశారు. దానినే ఇంటు మార్కులా మార్చారని తెలిపారు. రైట్‌మార్క్‌పైనే మరో గీతను గీసినట్టుగా స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు.

అధికారుల తీరు.. నవ్వులపాలు

- నమస్తే తెలంగాణలో 'ఆరిపోయిన గృహజ్యోతి పథకం' కథనం వచ్చిన రోజే స్పందించిన అధికారులు ప్రజాపాలన దరఖాస్తు ఫారమ్‌ను వెంటతీసుకెళ్లడంపై అనుమానాలు వెల్లువెత్తకమానవు.
- గృహజ్యోతి పథకం వర్తించడం లేదనే ఉద్దేశంతోనే మౌనిక ఇదే పథకం కోసం కార్యాలయంలో మరో దరఖాస్తు చేసుకున్నారు. మరి ఆ దరఖాస్తును సదరు అధికారులు ఎందుకు తేలేదన్నది మరో ప్రశ్న.
- మౌనిక దంపతులు ఉంటున్నది కిరాయి ఇంటిలోనే, అద్దె చెల్లించే స్థోమతలేని ఆమె జీరో కరెంటు బిల్లును ఎందుకు వద్దనుకున్నదో అధికారులే సెలవియ్యాలి.
- ఉచిత బస్సు, పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు పథకాల కోసం టిక్ పెట్టిన అదే మహిళ జీరో కరెంటు బిల్లు ఎందుకు వద్దనుకున్నదో వారే తేల్చి చెప్పాలి.
- మరో విచిత్రమేమిటంటే దరఖాస్తులో స్పష్టంగా టిక్ మార్క్ పెట్టినట్టుగా ఉన్నది. ఆ టిక్ మార్క్‌నే ఇంటుగా మార్చినట్టుగా చిన్నపిల్లలకైనా ఇట్టే తెలిసిపోతున్నది. ఏమార్చేందుకు ప్రయత్నించి ఆ చిన్న లాజిక్‌ను ఎలా మరిచారో!

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

సర్కారుపై మాజీ సర్పంచుల సమరశంఖం

- అసెంబ్లీ ఎదుట నిరసన ప్రదర్శన
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్
- బిల్లులివ్వకుండా ఎన్నికలకు వెళ్తే అడ్డుకుంటాం
- రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ స్పష్టీకరణ
- ఎన్నికల కమిషనర్, పీఆర్ సెక్రటరీకి వినతిపత్రాలు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంపై తాజా మాజీ సర్పంచులు సమరశంఖం పూరించారు. పెండింగ్ బిల్లల కోసం పోరుబాట పట్టారు. తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అసెంబ్లీ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అసెంబ్లీలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులకు వినతిపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా, తమ పదవీకాలం ముగిసి 8 నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లుల విడుదలతో జాప్యంపై జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. గ్రామాల అభివృద్ధికి తాము ఖర్చుపెట్టిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే అడ్డుకుంటామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్రంలోని వివిధ పల్లెలకు అనేక జాతీయ అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అప్పులు చేసి, గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పదవీకాలం ముగిసినా కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. దీంతో ఎందరో మాజీ సర్పంచుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక కొందరు సర్పంచులు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితులు దాపురించాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని యాదయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంపాక, రాష్ట్ర నాయకులు నాగయ్య, మెడబోయిన గణేశ్, నవీన్‌గౌడ్, మాట్ల మధు, సముద్రాల రమేశ్, శాత రాజుపల్లి ఆంజనేయులు, కొయ్యడ రమేశ్, నరబట్ట అజిత్‌బాబు, బాలస్వామి, పంపా కరుణాకర్, పంబ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 18న నవోదయ ఎంట్రెన్స్

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. 19లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జనవరి 18న ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు చేసుకునేవారు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్యకాలంలో పుట్టినవారై ఉండాలి.

ఎడ్‌సెట్‌లో 9,817 మందికి సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సులో మొదటి విడత సీట్లను శనివారం కేటాయించారు. 14,211 సీట్లుండగా, తొలివిడత కౌన్సెలింగ్‌లో 9,817 సీట్లు భర్తీ అయ్యాయి.

కోతుల దండయాత్ర!

- జనంపైకి ఎగబడి గాయపరుస్తున్న వానరాలు
- పంటలనూ నాశనం చేస్తున్న వైనం
- పట్టించుకోని సూర్యాపేట జిల్లా ఉన్నతాధికారులు

సూర్యాపేట, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : 'బాబోయ్ వానరాలు' అంటూ సూర్యాపేట జిల్లా బెంబేలెత్తిపోతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వేల సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ గ్రామాల్లో దండయాత్ర చేస్తున్నాయి. వాటంతట అవే పరస్పరం దాడులు చేసుకుంటూ.. ప్రజలపైనా తిరగబడి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇటీవల నూతనకల్ మండల కేంద్రంలో కోతులు రెండు గ్రూపులు విడిపోయి కొట్లాడటం భయానకం సృష్టించింది. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో సుమారు 2 వేల కోతులు బీభత్సం సృష్టించాయి. నాగారానికి చెందిన నూకనర్సమ్మ, జంగిడి నర్సయ్యపై కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి దవాఖాన పాలయ్యారు. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో ఒంటరిగా తిరగాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. రహదారులపై వెళ్లే వాహనదారుల పరిస్థితి మరింత ఘోరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమను కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల నూతనకల్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఘర్షణకు దిగిన కోతులు(ఫైల్), నాగారంలో కోతుల దాడిలో గాయపడిన జంగిడి నర్సయ్య